# శ్రీ భద్రాచల రామదాసు కీర్తనలు

## కాంభోజి - జంపె తాళము

ఇక్ష్వాకుకులతిలక యికనైనబలుకవె రామచంద్రా - నన్ను
రక్షింప కున్నావు రకులెవరయ్య రామచంద్రా॥

చుట్టు ప్రాకారములు సొంపుతో గట్టిస్తి - రామచంద్రా - ఆ
ప్రాకారానికిఁ బట్టె పదివేలవరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

గోపురమంటపాల్‌కుదురుగ గట్టిస్తి - రామచంద్రా - నన్నుఁ
గ్రొత్తగఁజూడక యిత్తఱిఁబ్రోవుము - రామచంద్రా॥ ॥ఇ॥

భరతునకుఁజేయిస్తి పచ్చలపతకము - రామచంద్రా - ఆ
పతకానికిఁబట్టె పదివేలవరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

శత్రుఘ్నునకు నేను జేయిస్తి మొలత్రాడు - రామచంద్రా - ఆ
మొలత్రాటికిఁబట్టె మొహరీలు పదివేలు రామచంద్రా॥ ॥ఇ॥

లక్ష్మణునకు జేయిస్తి ముత్యాలపతకము రామచంద్రా - ఆ
పతకానికిఁబట్టె పదివేలవరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

సీతమ్మకుఁజేయిస్తి చింతకుపతకము రామచంద్రా ఆ
పతకానికిఁబట్టె పదివేల వరహాలు రామచంద్రా॥ ॥ఇ॥

కలికితురాయి నీకు పొలుపుగ జేయిస్తి రామచంద్రా - నీవు
కులుకుచు దిరిగేవు - ఎవరబ్బ సొమ్మని రామచంద్రా॥ ॥ఇ॥

మీ తండ్రి దశరథ మహారాజు పెట్టెనా రామచంద్రా - లేక
మీమామ జనకమహారాజు పంపెనా రామచంద్రా॥ ॥ఇ॥

అబ్బ తిట్టితినని యాయాసపడవద్దు రామచంద్రా - ఈ
దెబ్బలకోర్వక అబ్బ తిట్టితి నయ్య రామచంద్రా॥ ॥ఇ॥

భక్తులందఱిని బరిపాలించెడి రామచంద్రా - నీవు
క్షేమముగ శ్రీరామదాసుని నేలుము - రామచంద్రా॥ ॥ఇక్ష్వాకు॥

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/